క్లుప్తంగా

28న విగ్రహాల ప్రతిష్ఠ

శిరివెళ్ల: కోటపాడు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామిస్వామి, చెన్న కేశవ స్వామి ఆలయాల్లో ఈ నెల 28వ తేదీన విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నాయి. రూ.10 లక్షల నిర్మించిన కోదండ రామ స్వామి ఆలయంలో శ్రీరామచంద్రుడు, సీతాదేవీ, ఆంజనేయస్వామి విగ్రహాలు, ధ్వజ స్తంభం ప్రతిష్ఠించనున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే శ్రీ చెన్న కేశవస్వామి ఆలయంలో చెన్నకేశవస్వామి, గణపతి, లక్ష్మీదేవీ విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం స్వామి వారి కల్యాణం ఉంటుందని వివరించారు.

ఎరువుల కొరత లేదు

శిరివెళ్ల: మండలంలో ఎరువుల కొరతలేదని ఏఓ సుధాకర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, అమ్మకాలు, ఈ–పాస్ నమోదును పరిశీలించారు. రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన డీఏపీ, యూరియా రైతు భరోసా, మనగ్రోమోర్, ప్రైవేట్ దుకాణాల్లో తగినంత నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఎరువులు అందకపోతే తమ దృష్టికి తేవాలని, నిర్ణీత ధరలకే విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు.

ప్రహరీ నిర్మాణం ప్రారంభం

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలోని ముస్లిం మైనార్టీ శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులను రూ.5 లక్షలతో ప్రారంభించినట్లు పంచాయతీరాజ్ ఏఈ రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల నుంచి ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ నిధులు కేటాయించడంతో ప్రహరీ పనులు చేపట్టామన్నారు. రెండు మాసాల్లో పనులు పూర్తి చేస్తామని ఏఈ చెప్పారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబర్ అమీర్ అహమ్మద్, ఇంజినీరింగ్ అసిస్టెంటు శ్రీకాంత్ రెడ్డి, ముస్లింలు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం




పూజలు నిర్వహిస్తున్న పండితులు

రుద్రవరం: మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి, వేంకటేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాల్లో మహాగణపతి, సుబ్రహ్మణ్య,ఆంజనేయ, పార్వతీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహాల పునః ప్రతిష్ఠ, ధ్వజ, శిఖర కలశ, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభించారు. ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం గంగా పయనం ,గణపతి పూజ,స్వస్తి, పుణ్యాహవాచనం,పంచగవ్య ప్రాశనం, రక్షా బంధనం, మాతృకా పూజ, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన వంటి పూజలు చేపట్టారు. 27న విగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

మందుల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): ఆజోవిభో కందాలం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అప్పాజోష్యుల సత్యనారాయణ సౌజన్యంతో దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న దివ్యాంగులకు సోమవారం నెలవారి మందులు పంపిణీ చేశారు. దివ్యాంగుల సంక్షేమం గౌరవాధ్యక్షుడు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ.10వేల విలువైన నెలవారి మందులను ఉచితంగా పంపిణీ చేశామని చెప్పారు. ప్రసాద్, శివరామిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఆశ్రమ నిర్మాణానికి విరాళం



నగదు అందజేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామంలో కాశిరెడ్డినాయన నూతన ఆశ్రమ నిర్మాణానికి ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోపవరం బాలవెంకటరెడ్డి రూ.50,116 నిర్వాహకులు తులశమ్మ, చిన్న కొండన్నకు సోమవారం విరాళంగా అందజేశారు. వారు మాట్లాడుతూ తన తల్లి వెంకటలక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఆశ్రమానికి విరాళం ఇచ్చినట్లు చెప్పారు. సర్పంచ్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ, జక్కుల రాముడు, నాగేశ్వరయాదవ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రుద్రవరం: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు చెరుకు కోటేష్, మల్లెల లక్ష్మీదేవి కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దారు మహబూబ్ బాషాకు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు,కళాశాలల్లో సంక్రాంతి పండుగకు ఇచ్చే సెలవుల మాదిరిగానే రంజాన్, క్రిస్మస్ పండుగలకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం స్కాలర్ షిప్ రద్దును విరమించుకోవాలని, హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 25శాతం సీట్లిచ్చే విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు. దాసరి జ్వాల, నరసింహ, ఆంటోని, లక్ష్మీనరసయ్య, మధు,ఓబులయ్య,ఆదినారాయణ పాల్గొన్నారు.



తిమ్మనపల్లె-నర్సాపురం మధ్య వరి పొలం బురదలో పల్లకీని మోసుకొస్తున్న దృశ్యం (ఫైల్)



ప్రస్తుతం మట్టి తోలించి రోడ్డును చదును చేస్తున్న దృశ్యం

పార్వేటోత్సవానికి మార్గం సుగమం

రుద్రవరం: అహోబిలేశుడి పార్వేటోత్సవానికి దారుల సమస్య వేధిస్తుండేది. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి పల్లకీని చేర్చడంలో బోయీలు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి దారిని కప్పేసేవి. ఇక నడిచే దారులు అడుగడుగునా గుంతలు,మధ్యలో వాగులు,వంకలు వాటిని దాటే సమయంలో వారి బాధలు వర్ణనాతీతం. అంతేకాకుండా వారు కాళ్లకు చెప్పులు ధరించరాదు. దీంతో పార్వేటోత్సవం పూర్తయ్యే వరకు వాటిని ధరించరు. కాలినడకనే పల్లకీని మోస్తూ తిరుగడం ఆనవాయితీ. ఇటీవల ప్రజాప్రతినిధులు, అధికారుల్లో మార్పు వచ్చింది. పార్వేట పల్లకీ గ్రామానికి చేరడానికి రెండు రోజుల ముందు దారులకు మరమ్మతులు చేసి రాకపోకలకు సులభతరంగా మారుస్తున్నారు. అహోబిలం నుంచి బయలు దేరిన స్వామి వారి పల్లకీ మొదట ఆళ్లగడ్డ మండలం బాచేపల్లెలో కొలువుదీరి అక్కడి ప్రజల నుంచి విశేష పూజలందుకొని కొండంపల్లె, ఆర్.కృష్ణాపురం,కోటకందుకూరుకు చేరుకుంటారు. కోటకందుకూరు నుంచి మర్రిపల్లెకు చేరే క్రమంలో వక్కిలేరు వాగు దాటాల్సి ఉంది. అయితే వాగులో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో పల్లకీని మరో దారిలో మర్రిపల్లె, అనంతరం యాదవాడకు చేర్చుతున్నారు. అక్కడి నుంచి రుద్రవరం మండలం ఆలమూరులోకి ప్రవేశిస్తుంది. ఆలమూరు నుంచి పొలాల మధ్యలో నుంచి తిమ్మనపల్లె, నర్సాపురం చేరుకుంటుంది. గతేడాది వరకు ఈ ప్రయాణంలో బోయీలకు విపత్కర పరిస్థితులు ఎదురయ్యేవి. దారి సరిగా లేక పోవడం, పక్కనే ఉన్న పొలాల్లో వరి నాట్లు వేసి ఉండటం, మరో దారి లేక బోయీలు పల్లకీని వరి నాట్లు వేసిన బురద మడుల్లో నుంచి మోసుకొచ్చేవారు. ఈ పరిస్థితిని అధిగ మించేందుకు గతేడాది దారిపై మట్టి తోలించి చదును చేసి మార్గం సుగమం చేశారు. ప్రస్తుతం పల్లకీ గ్రామానికి చేరుకుంటుండటంతో ఆయా గ్రామాల నాయకులు రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నారు.

అహోబిలేశా.. గోవిందా..

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవల్లో భాగంగా సోమవారం యాదవాడ గ్రామంలో ఉత్సవమూర్తులు శ్రీ జ్వాలా నరసింహస్వామి, శ్రీ ప్రహ్లాదవరద స్వామి వారి పల్లకీ కొలువు దీరింది. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సర్పంచ్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ శంకర్‌రెడ్డితో పాటు గ్రామస్తులు తరలి వచ్చి విశేష పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి రాకతో గ్రామం గోవింద నామస్మరణతో మారుమోగింది.అర్చకులు కల్యాణరామన్, నరసింహన్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఉత్సవమూర్తులను దర్శించుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

పారదర్శకంగా పథకాల అమలు

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- నల్లగట్లలో కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: ఇంతకుముందెన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసి పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రెండో రోజు నల్లగట్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటా సంక్షేమ పండుగ నెలకొని ఉంటే.. చెప్పుకోవడానికి ఏమీ లేక రోడ్లెక్కి టీడీపీ వారు ఉనికిని కాపాడుకునేందుకు పనికి మాలిన మాటలు మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, మూడేళ్లలో ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి చేకూర్చిందనేది వివరించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని ప్రజలను కోరారు. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. తమ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలు, మహిళల సంక్షేమం కోసం కోట్లాది రూపాలయాలను వెచ్చిస్తోందని చెప్పారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ పథకాలు అందిస్తున్నామని వివరించారు. జగనన్న పాలనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సర్పంచ్ రామకృష్ణ, నాయకులు భాస్కర్‌రెడ్డి, విజయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా శనగ కోతలు



శనగ పైరును కోస్తున్న కూలీలు

ఉయ్యాలవాడ : మండలంలో రబీలో సాగు చేసిన పప్పు శనగ పంట కోతలు సోమవారం ప్రారంభమయ్యాయి. రబీ సీజన్‌లో 30,612 ఎకరాల్లో శనగ పంట సాగైంది. గత ఏడాది అక్టోబర్ నెలలో రైతులు సాగు చేశారు. విత్తనం వేసిన 40 రోజులకు మోస్తరు వర్షం కురిసింది. పంటకు అవసరమైన తేమ అందడంతో రైతులు ఊరట చెందారు. అయితే గత 30 సంవత్సరాలుగా ఒకే పంట సాగు చేయడంతో 30 శాతానికి పైగా పంటకు వైరస్ తెగుళ్లు సోకాయి. అయినా రైతులు వివిధ మందులు పిచికారీ చేసి పంటను రక్షించుకున్నారు. ఏదిఏమైతేనేమి పంట చేతికిరావడంతో ప్రస్తుతం మాయలూరు, ఉయ్యాలవాడ, కొండుపల్లె గ్రామాల్లో కోతలు ప్రారంభమయ్యాయి. పంట నూర్పిడి చేస్తే దిగుబడులు ఏ మాత్రం వచ్చేది తెలుస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

దొర్నిపాడు: మండలంలో శనగ కోతలు ప్రారంభమయ్యాయి. మెట్ట పంటల్లో భాగంగా ప్రధానంగా శనగను మండలంలోని క్రిష్టిపాడు, దొర్నిపాడు, గుండుపాపల, డబ్ల్యూ.గోవిందిన్నె, డబ్ల్యూ.కొత్తపల్లె, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె తదితర గ్రామాల్లో 11,280 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం యంత్రాల ద్వారా కోతలు జరుగుతున్నాయి. గతంలో కూలీలతో కోతలు కోయించి, కుప్పగా వేసి యంత్రంతో గింజలను బయటకు తీసేవారు. ప్రస్తుతం ఆధునిక నూర్పిడి యంత్రాలు అందుబాటులోకి రావడంతో ఎకర పొలంలో పంటను కేవలం 10 నిమిషాల్లో నూర్పిడి పూర్తి చేస్తున్నాయి. యంత్రానికి ఎకర పంట కోతకోస్తే రూ.2వేల వరకు ఇస్తున్నారు. గతంలో కూలీలకు రూ.1500, యంత్రానికి రూ.2వేలు ఇచ్చేవారు. అంతేగాక అది కూడా వారం రోజుల సమయం పట్టేది. ఎకరాకు 7నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

అధికారిపై చర్యలు తీసుకోండి



స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేస్తున్న లబ్ధిదారుడు

ఉయ్యాలవాడ : ఇల్లు మంజూరు కావాలన్నా, బిల్లులు ఖాతాలో నమోదు కావాలంటే రూ. 5 వేలు చెల్లించాలని హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ డిమాండ్ చేయడంతో ఆమేరకు అందజేశానని, అయినా బిల్లు మంజూరు కాలేదని ఆయనపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారుడు కొట్టం రామయ్య అధికారులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నాగరాజుకు మండల కేంద్రానికి చెందిన కొట్టం రామయ్య గతంలో ఇక్కడ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరామయ్యకు డబ్బులు ఇచ్చానని చెప్పారు. డీఈ స్పందిస్తూ అర్హులు ఇంటి నిర్మాణానికి ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఇందుకు మధ్యవర్తులు, హౌసింగ్ సిబ్బందికి డబ్బులు చెల్లించనవసరం లేదని స్పష్టం చేశారు. సిబ్బంది అక్రమాలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సంజామల మండలం అక్కంపల్లె గ్రామానికి చెందిన శివమల్లికార్జున్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి మండలంలోని పుచ్చకాయలపల్లె రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 836లో ఉన్న భూమిని ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



వాసవీ మాతను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం,



ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి,



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో సోమవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆర్యవైశ్య మహిళలు, కన్యలు అమ్మవారికి చెరువు కట్ట నుంచి గంగాజలం తీసుకొచ్చి అభిషేకం చేశారు. అలాగే విశేష ద్రవ్యాలు, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకం చేపట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన జరిపించి మహా మంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం మహిళా మండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయిరు. అలాగే.. నూనెపల్లె అమ్మవారిశాలలో ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు శ్రీవాసవీ రిటైల్ మర్చెంట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుబ్బా రజిని కాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఓంకారేశ్వర స్వామి, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. సభ్యులు ఇందుమతి, శోభారాణి, కిరణ్‌కుమార్, కాల్వ రాజా, రాము, నారాయణ, గర్రె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శిరివెళ్ల: స్థానిక యర్రగుంట్ల శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు కేశవశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పాలాభిషేకం, ఒడిబియ్యం కార్యక్రమం చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణగావించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకదార ఈశ్వరయ్య శ్రేష్ఠి, కార్యవర్గ సభ్యులు మేడా రామకృష్ణ, రిటైర్డ్ హెచ్‌ఎం రామకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: స్థానిక బెస్త కాలనీకి చెందిన మురారమ్మ అనే మహిళ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. తల్లీ కుమారుడి మధ్య నెలకొన్న స్వల్ప వాగ్వాదంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగిందని కాలనీ వాసులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

ఆళ్లగడ్డ: అకాల మృత్యువాత పడిన గఫార్ (28) కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హామీనిచ్చారు. పట్టణంలోని రహిమాన్ వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గఫార్ ఆదివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలిసన ఎమ్మెల్యే సోమవారం మృతుడి ఇంటికి చేరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, నజీర్, అమీర్ ఉన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో 'స్పందన'

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు పర్యవేక్షణలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు మూడు వినతులు వచ్చాయని ఆయన తెలిపారు. పట్టణంలోని 43 సచివాలయాల్లో నిర్వహిస్తున్న రోజువారీ స్పందనలో వార్డుల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నందున వినతులు తగ్గాయని చెప్పారు. సీనియర్ అసిస్టెంట్ వరమద్దిలేటి పాల్గొన్నారు.


రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని ఏపీఎస్ ఆర్టీసీ అప్రెంటిస్ ట్రైనింగ్ నిరుద్యోగులు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు పుల్లయ్య, బాబు, వెంకటరమణ మాట్లాడుతూ ఏపీ ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా ఐటీఐ అప్రెంటిస్ పూర్తి చేసిన నిరుద్యోగులకు ఆర్టీసీలో శ్రామిక్, మెకానిక్ పోస్టులు భర్తీ చేయాలని, అయితే.. ఆర్టీసీ అధికారులు టెండర్ల సిస్టమ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా శ్రామిక్, మెకానిక్ ఉద్యోగాలు భర్తీ చేశారని ఆరోపించారు. దీని వల్ల అప్రెంటీస్ ట్రైనింగ్ నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేకూర్చాలని కోరారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలపై నేడు సమావేశం

మహానంది: క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం నంద్యాలలో మొదటి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నంద్యాలలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీరాజ్, రవాణా, వైద్యారోగ్యశాఖ, అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

గోస్పాడు: చిరుధాన్యాల సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని యాళ్లూరు గ్రామంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం– 2023 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఆర్ మాట్లాడుతూ కొర్రలు, రాగులు, జొన్నలు, సజ్జలు వంటి పంటల సాగుకు పెట్టుబడి, శ్రమ, పంట కాల వ్యవధి తక్కువని, అలాగే దిగుబడి, ధర ఆశించిన స్థాయిలో లభిస్తుందని చెప్పారు. ఈ ధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. చిరుధాన్యాల ప్రాధాన్యత, వాటిని పండించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మార్కెటింగ్ విధానం, అంతర్జాతీయ స్థాయిలో చిరుధాన్యాల విశిష్టతపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యాళ్లూరు సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, శాస్త్రవేత్తలు శాంతి ప్రియ, నరసింహులు, అరుణ్ కుమార్, జ్యోత్స్న, రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం దీక్ష చేపట్టారు. రైతు సంఘం కో కన్వీనర్ సోమన్న అధ్యక్షతన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో దీక్షను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 6లక్షల ఎకరాల్లో రైతులు మిరప, పత్తి పంటలు సాగు చేస్తే పంట చేతికి రాక తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ సీడ్ కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతులకు నష్ట పరిహారం అందేలా చూడాలని కోరారు. నాయకులు బాబాఫక్రుద్దీన్, రాముడు, ప్రసాద్, భాస్కర్, సుబ్బరాయుడు, నాగరాముడు, ధనుంజయుడు, సామేలు, హరినాథ్ పాల్గొన్నారు.

యువత నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలి



రుద్రవరంలో నేతాజీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ

రుద్రవరం: నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు,విద్యార్థులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం)/(సిటీ) : నేతాజీ సుభాష్ చంద్రబోస్ త్యాగాలను, ధైర్య సాహసాలను మరువలేమని పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ పేర్కొన్నారు. సోమవారం కళాశాల ఆవరణలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, పార్వతి, ప్రణీత, మల్లయ్య, రమేష్‌కుమార్, ఫైజుల్లా, డాక్టర్ గంగన్న పాల్గొన్నారు. అలాగే.. జగజ్జననీ నగర్‌లోని సుభాష్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు మస్తాన్‌వలి,సయ్యద్ మౌలాలి, ఆరీఫ్, షారుక్, జగదీష్‌రావు, కిరణ్ పాల్గొన్నారు. పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి మాట్లాడారు.

ఆళ్లగడ్డ: దేశ స్వాతంత్ర్యం కోసం 60 వేల మంది యువకులతో ఆజాద్ హింద్ ఫౌజును నెలకొల్పిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేటి యువతకు స్ఫూర్తి దాయకమైన నాయకుడని హెచ్‌ఎం కోటయ్య శ్లాఘించారు. నేతాజీ 126వ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రం చాగలమర్రిలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నేతాజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండపాల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): బొమ్మలసత్రంలోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో వివిధ మండపాల నిర్మాణానికి సోమవారం దాతలు భూమి పూజ చేశారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మలికిరెడ్డి లలితమ్మ, డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో మందిరం ఆవరణలో వినాయక మండపం, దత్తాత్రేయ మండపం, ద్వారకామయి, చావిడి, ఊరువాకిలి తదితర మండపాలకు భూమి పూజ చేశామని, త్వరలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. వెంకటరామిరెడ్డి, సుబ్బారెడ్డి, పూర్ణచంద్రారావు, భీమిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుష్కలంగా యూరియా

నంద్యాల(వ్యవసాయం): మండలంలో రైతులకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి స్వప్నికా రెడ్డి సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ హోల్‌సేల్, రిటైల్ షాపుల వద్ద 1,500 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ ఆఫీసులో సుమారు 1,600 మెట్రిక్ టన్నులు మొత్తం 3,100 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని చెప్పారు. రైతులు పుకార్లను నమ్మి అధిక ధరలకు కొనుగోలు చేయొద్దని కోరారు. వ్యాపారులు ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే సెల్ 8331057471 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మండలంలోని ఎరువుల డీలర్లందరూ నిర్ణీత ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.